

పనులు పెండింగ్‌లో ఉండొద్దు

పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ ఆదేశించారు.

8లో



రూ.100కోట్లతో అభివృద్ధి

మధిర నియోజకవర్గంలో రూ.100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయని ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు.

8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 43° / 29°

జిల్లా అంతటా శనివారం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

అనుమతి లేని కళాశాలల్లో చేరొద్దు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థులు ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల విషయమై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు సూచించారు. అకాడమీలు, ట్యూషన్ పాయింట్లకు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఎలాంటి అనుమతి ఉండదని తెలిపారు. వీటిలో చేరితే పరీక్షల సమయాన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశమున్నందున విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

ప్రారంభమైన పాలిసెట్ కౌన్సెలింగ్



కాపీ అందజేస్తున్న ప్రిన్సిపాల్ జకీరుల్లా

ఖమ్మం సహకారనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు పాలిసెట్ కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల కేంద్రంలో తొలిరోజు స్లాట్ బుక్ చేసుకున్న 278మందిలో 246మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. ఇక శనివారం 165మంది స్లాట్ బుక్ చేసుకున్నారని కౌన్సెలింగ్ సెంటర్ కోఆర్డినేటర్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈమేరకు హాజరైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా ధృవీకరణ పత్రాలు అందజేశారు.

20న విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించండి

సత్తుపల్లిరూరల్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీన విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ దేశించారు. సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంఈఓలు, హెచ్ఎంలతో విద్యాదినోత్సవం, మన ఊరు–మన బడి పనుల ప్రగతి, పాఠశాలల్లో విద్యార్థుల హాజరుపై సమీక్షించారు. మన ఊరు–మన బడి కింద చేపట్టిన పనులు పూర్తయిన 48 పాఠశాలను ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే, పిల్లలకు రాగిజావ పంపిణీని లాంఛనంగా ప్రారంభించాలని, సోమవారం కల్లా పాఠశాలల్లో నూరు శాతం విద్యార్థులు హాజరయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు. వీసీలో ఖమ్మం కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ స్నేహలత, డీఈఓ సోమశేఖరశర్మ, ఆర్ఎంఓ రాజశేఖర్, ఏఎంఓ రవి, అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లాలో పదో తరగతి పరీక్షలు 749మంది రాయగా 197మంది(26.30శాతం), ఇంటర్‌లో 1,158మందికి 562మంది(48.53శాతం) ఉత్తీర్ణత సాధించారని డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 24నుంచి జూలై 7వ తేదీ వరకు www.telanganaopenscool.org వెబ్‌సైట్‌లో లేదా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా ఇంటర్ రీకౌంటింగ్ కోసం సబ్జెక్టుకు రూ.400, పదో తరగతికైతే రూ.350, రీ వెరిఫికేషన్ కోసం ఇంటర్, పదో తరగతి అభ్యర్థులు సబ్జెక్టుకు రూ.1,200 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ఉగ్రభానుడు

రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత



ఖమ్మం గాంధీచౌక్: సూర్యప్రతాపం ఏ మాత్రం తగ్గడం లేదు. ఉదయం ఏడు గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తుండగా మధ్యాహ్నంకల్లా ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయి చేరుతున్నాయి. ఎండకు వడగాలులు తోడవుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇక రాత్రి ఏడు, ఎనిమిది గంటల వరకు ఎండల ప్రభావం తగ్గక బయటకు రావాల్సిన వారు ఇబ్బంది పడుతున్నారు. కాగా, శుక్రవారం రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత భద్రాద్రి జిల్లా ములకపల్లిలో 45.3, పాల్వంచ మండలం యానంబైల్‌లో 45.2 డిగ్రీలుగా నమోదైంది. ఇక ఖమ్మం జిల్లా పమ్మిలో 44.9, మధిరలో 44, పల్లెగూడెంలో 43.9, ఎర్రుపాలెంలో 43.7, ముదిగొండ, గంగారం, నేలకొండపల్లిలో 43.6, చింతకాని, ఖానాపురంలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, జిల్లాలో కనిష్టంగా కూడా 41.2 డిగ్రీ ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం.

ప్రమాద ఘంటికలు



జూన్ రెండో వారం ముగిసినా చినుకు జాడ లేదు. మండుతున్న ఎండలు, వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు మరింత లోతుల్లోకి వెళ్తాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఏటా జూన్‌లో వర్షాలు కురిస్తే మే నెలతో పోల్చుకుంటే భూగర్భ జలమట్టం పెరుగుతుంది. కానీ ఈసారి నైరుతి రుతుపవనాలు జిల్లాను తాకకపోవడం, మరింత ఆలస్యమవుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీంతో వర్షాధార పంటల మాటేమో కానీ బోర్లు, బావుల కింద సాగు చేసేందుకు కూడా అనుకూలమైన వాతావరణం కనిపించడం లేదు. రానున్న రోజుల్లోనైనా విస్తృతంగా వర్షాలు కురిస్తేనే భూగర్భ జలాల పరిస్థితి మెరుగై బోర్లు, బావుల కింద పంటల సాగు సాధ్యమవుతుందని రైతులు చెబుతున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



జిల్లాలో భూగర్భ జలమట్టం ఇలా.. (మీటర్లలో)

ఏడాది	మే	జూన్	జూలై
2018-19	7.25	7.75	7.93
2019-20	6.77	6.13	4.13
2020-21	5.79	5.44	3.75
2021-22	6.07	5.98	3.32
2022-23	5.76	-	-

జిల్లాలో పడిపోతున్న భూగర్భ జలమట్టం

- వర్షాల ఆలస్యంతోనే ఈ పరిస్థితి
- గత నెలలో 5.76 మీటర్ల లోతులో.. ఈనెల మరింత తగ్గుతుందని అంచనా
- బోరు, బావుల ఆధారిత సాగుపై ప్రభావం

మండుతున్న ఎండలతో..

మృగశిర కార్తె ముగింపునకు వచ్చినా నైరుతి రుతుపవనాలు జిల్లాలోకి ప్రవేశించలేదు. మరోవైపు ఎండలు దంచి కొడుతున్నాయి. ఈ కారణాలతో జూన్‌లో భూగర్భ జలమట్టం మరింత లోతుల్లోకి వెళ్లే ప్రమాదం కనిపిస్తోంది. సహజంగా వర్షాకాలంలో భూగర్భ జలాలు పెరగాల్సి ఉండగా, గత నాలుగేళ్లలో ఇలాగే జరిగింది. కానీ ఈసారి పరిస్థితి కనిపించడం లేదు. 2020–21 మే నెలలో 5.71 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా, జూన్‌లో 5.44 మీటర్ల వద్దే నీరు లభించింది. 2021–22 ఏడాది మేలో 6.07 మీటర్ల లోతులో ఉంటే. జూన్‌లో 5.98కు చేరింది. ఈసారి మేలో 5.76 మీటర్లలో భూగర్భ జలాలు ఉండడం, గత ఐదేళ్లలో ఇదే అత్యల్పం కాగా.. జూన్‌లో మరింత లోతుల్లోకి వెళ్తాయని భూగర్భ జలశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇకనైనా రుతుపవనాల రాకతో వర్షాలు కురిస్తే ఆగస్టు నుంచి నవంబర్ వరకు భూగర్భ జలాల పరిస్థితి మెరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

గత ఐదేళ్లలో ఆశాజనకమే

గత ఐదేళ్లుగా పరిశీలిస్తే వర్షాకాలంలో భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉంటున్నాయి. 2018–19 ఏడాదిలో జిల్లాలో సగటున 5.88 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా.. 2019 –20లో 5.49 మీటర్లు, 2020–21లో 3.95 మీటర్లు, 2021–22లో 4.27 మీటర్లు, 2022–23లో 4.22 మీటర్లలో భూగర్భ జలాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా వర్షాకాల సీజన్‌లో మాత్రం దాదాపు 2.10 మీటర్లలోనే భూగర్భ జలాలు ఉంటున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మాసాల్లో ఏటా 2.10 మీటర్ల నుంచి 3.27 మీటర్లలోనే భూగర్భ జలాల లభ్యంత ఉండగా.. రైతులు బోర్లు, బావుల కింద పంటలు సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవకపోయినా జులై నుంచి నవంబర్ వరకు విస్తారంగా కురిస్తే వర్షాధార పంటలతోపాటు సాగర్ ఆయకట్టు, బోర్లు, బావుల కింద పంటల సాగు చేసుకునేందుకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయని, లేనిపక్షంలో ఈ ఏడాది సాగుపై ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు చెబుతున్నారు.

పంటలు సాగయ్యేనా?

ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ఆగమనం ఆలస్యం కావడంతో రైతులు ఇంకా సాగు పనులు ప్రారంభించలేదు. మెట్ట పంటల సాగు కోసం దుక్కులు దున్ని ఎదురు చూస్తున్నారు. మే నెలలో 5.76 మీటర్ల లోతులో ఉన్న జలమట్టం.. ఇప్పుడు అంతకంటే తక్కువకు పడిపోతుందని అంచనా. ఈక్రమంలో జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో విస్తారంగా వర్షాలు కురిస్తేనే రైతన్నకు మేలు కలుగుతుంది. జిల్లాలో మొత్తం పంట సాగు విస్తీర్ణం 6,86,874 ఎకరాలు. జిల్లాలో ఉన్న 52,480 బోరుబావుల పరిధిలో 1,40,714 ఎకరాలు, 27,848 బావుల కింద 56,005 ఎకరాలు సాగవుతాయని గణాంకాలు చెబుతున్నాయి. అంటే ఈసారి వర్షాధారంతోపాటు బోర్లు, బావుల కింద పంటలు సాగు చేయాలంటే వర్షాలు విస్తారంగా కురవాల్సిందే.

ఐటీడీఏలో గోల్‌మాల్?

- టెండర్ల ఖరారులో నిబంధనలకు నీళ్లు
- కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన కొందరు అధికారులు
- ఈ ఏడాదైనా పాఠశాలల్లో డిప్యూటేషన్లు సక్రమంగా జరిగేనా..!
- ఐటీడీఏలో బయోమెట్రిక్ హాజరు అమలెప్పుడో..



భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏలో గత విద్యాసంవత్సరం ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, వార్డెన్ల డిప్యూటేషన్లు.. రద్దు వ్యవహారం విమర్శలకు తావిచ్చింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలోనూ అధికారుల్లో మార్పు కనిపించడంలేదు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాల, గురుకుల పాఠశాలలు, కళాశాలలో విద్యార్థుల కోసం నిత్యావసర సరుకులు, గుడ్లు, చికెన్ సరఫరాకు ఇటీవల నిర్వహించిన టెండర్లను నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టినట్లు పీఓకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఐటీడీఏలో పారదర్శకత కరువైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అర్హత లేకపోయినా టెండర్లు..

ఐటీడీఏ పరిధి విద్యాసంస్థల్లో నిత్యావసర సామగ్రి, ఆహార వస్తువులు, గుడ్లు, చికెన్ తదితర వస్తువుల సరఫరాకు ఇటీవల టెండర్లు నిర్వహించారు. కొందరు అధికారులు కాంట్రాక్టర్లతో మిలాఖత్ అయి నిబంధనలకు విరుద్ధంగా టెండర్లను కట్టబెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉదాహరణకు పాల్వంచ మండలంలో గిరిజనుడిని కాదని గిరిజనేతరుడికి టెండర్ అప్పగించటం వివాదాస్పదంగా మారింది. గిరిజనుడి కంటే గిరిజనేతరుడు చికెన్ తక్కువ ధరకు కోట్ చేశారు. కానీ టెండర్‌దారుడు సొంత వాహనం, మాంసపు దుకాణం కలిగి ఉండి స్థానిక సంస్థలకు పన్ను చెల్లించి ఉండాలి. సేల్స్ ట్యాక్స్, ఇన్‌కంట్యాక్స్‌లతో పాటుగా జీఎస్టీ ప్రతులను షెడ్యూల్‌లో సమర్పించాలి. మార్కెట్‌లో సొంత దుకాణం, మున్సిపాలిటీ పన్ను చెల్లింపు రశీదులు, ఇతర అర్హతలు లేకపోయినా ఏకపక్షంగా గిరిజనేతరుడికి టెండర్ అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదరు గిరిజనేతరుడు కిరాణ దుకాణం నడుపుతూ చికెన్ దుకాణం నడుపుతున్నట్లు అధికారులను పక్కదోవ పట్టించాడని, ఓ చికెన్ షాప్ యజమాని వద్ద సబ్ కాంట్రాక్టర్‌గా కొంటూ, అదే షాప్‌ను తన చికెన్ షాప్‌గా పేర్కొంటూ టెండర్ దక్కించుకున్నాడని, ఇదంతా కొందరు అధికారుల కనుసన్నల్లోనే జరిగినట్లు తెలుస్తోంది. దీంతో గిరిజన సంఘం నాయకులు ఐటీడీఏ పీఓ, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇతర మండలాల్లో సైతం అర్హతలు లేనివారికి ఐటీడీఏలోని 'కొందరు పెద్దల'చల్లటి చూపుతో టెండర్లు దక్కాయని ఆరోపణలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీడీఏ పరిధిలో అన్ని యూనిట్లలో జరిగే అభివృద్ధి, సంక్షేమ పనులలో అధికారులు నిబంధనలకు పాతరేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

డిప్యూటేషన్లలో ఈసారి ఏం చేస్తారో..?

2022–23 విద్యా సంవత్సరంలో ఆశ్రమ పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డెన్లకు నియమ నిబంధనలకు విరుద్ధంగా మౌఖిక ఆదేశాలతో డిప్యూటేషన్లను ఇవ్వడం.. అనంతరం రద్దు చేయడం శాఖకు మచ్చ తెచ్చాయి. 2023–24 విద్యా సంవత్సరంలో ఇప్పటికే ఆరుగురు టీచర్లను ఉపాధ్యాయులు లేని ఏకోపాధ్యాయ పాఠశాలలకు, ఎనిమిది ఆశ్రమ పాఠశాలలకు హెచ్ఎంలను సీనియారిటీ ప్రకారం నియమించారు. గతేడాది సుమారు 80 మందికి డిప్యూటేషన్ ఇవ్వగా.. ఈసారి కూడా అదే సంఖ్యలో డిప్యూటేషన్లు నిర్వహిస్తారా.. లేక ఆ పోస్టులను సీఆర్‌టీలతో భర్తీ చేస్తారా అన్నది తేలాల్సి ఉంది. ఉపాధ్యాయ సంఘాల సమక్షాన పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలనే డిమాండ్ వస్తోంది.

కోవిడ్ పోయినా..

ఐటీడీఏలో అధికారుల, సిబ్బంది సమయపాలన పాటించడంలేదని, విధులకు ఇష్టారీతిన హాజరవుతున్నారని విమర్శలు ఉన్నాయి. ఐటీడీఏలో అన్ని యూనిట్లలో కలిపి సుమారు 120 మంది వరకు పనిచేస్తున్నారు. వీరందరూ ఐటీడీఏలోని డీడీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్‌పై ఉదయం, సాయంత్రం వేలిముద్రతో హాజరు నమోదు చేసుకునేవారు. కోవిడ్ సమయంలో మినహాయింపు ఇవ్వగా, మళ్లీ పునరుద్ధరించలేదు. దీంతో కొందరు ఉద్యోగులు కార్యాలయ వేళల్లో బయట తిరుగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు పనులపై వచ్చే గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు. ఈ విషయమై ఐటీడీఏ ఏపీఓ(జనరల్) డేవిడ్‌రాజ్‌ను వివరణ కోరగా అందరి సమక్షంలోనే టెండర్లు పారదర్శకంగా నిర్వహించి అప్పగించామని తెలిపారు. అయితే, టెండర్‌దారులు సమర్పించిన వివరాలపై విచారణ చేయటానికి సమయం సరిపోలేదన్నారు. ఒకవేళ తమకు అందిన అభ్యంతరాలు నిజమేనని తేలితే టెండర్‌దారులను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని తెలిపారు. ఇక బయోమెట్రిక్ యంత్రాన్ని త్వరలోనే పునరుద్ధరిస్తామని చెప్పారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మానం



తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించగా సత్తుపల్లిలో భారీ ర్యాలీ ఏర్పాటుచేశారు. అనంతరం మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులను కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సన్మానించి వారి సేవలను కొనియాడారు. – సత్తుపల్లిటౌన్

కేఎంసీకి 'పట్టణ ప్రగతి' అవార్డు



మంత్రి కేటీఆర్ నుంచి అవార్డు అందుకుంటున్న మేయర్ నీరజ, కమిషనర్ ఆదర్శ్

ఖమ్మంమయూరిసెంటర్: మహానగరాలకు దీటుగా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో దూసుకెళ్తున్న ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు గుర్తింపు లభించింది. లక్షకు పైగా జనాభా కేటగిరీలో వినూత్న మునిసిపల్ మౌలిక సదుపాయాల కల్పన విభాగంలో పట్టణ ప్రగతి అవార్డును ప్రకటించారు. కూడళ్ల అభివృద్ధి, సుందరీకరణ, సెంట్రల్ లైటింగ్, పచ్చదనం, థీమ్స్‌ను ప్రతిబింబించేలా వాల్ పెయింటింగ్స్ వేయించడంతో పాటు లకారం ట్యాంక్ బండ్, గోళ్లపాడు ఛానల్ సుందరీకరణ తదితర పనులకు అవార్డు దక్కింది. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభి అవార్డ్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు. కాగా, కేఎంసీకి అవార్డు దక్కడంతో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ గౌతమ్ తదితరులు పాలక వర్గం, అధికారులను అభినందించారు.

సీతాకోక చిలుకలా ఖమ్మం..



ర్యాలీలో పాల్గొన్న మంత్రి పువ్వాడ, కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, మేయర్ నీరజ, కార్పొరేటర్లు, అధికారులు, కార్మికులు

- మంత్రి కేటీఆర్ అండతోనే అభివృద్ధి
- కొత్త ఆలోచనలతో సాగుతున్న ఐఏఎస్ అధికారులు
- అందరి కృషితో అన్ని రంగాల్లో పరుగులు
- పట్టణ ప్రగతి సభలో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



కేఎంసీలో సఫాయన్న, సఫాయమ్మ విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి, మేయర్ తదితరులు



కార్మికులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్, మేయర్, కమిషనర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: గొంగళి పురుగులా ఉన్న ఖమ్మంను సీతాకోక చిలుకలా మార్చుకున్నామని, ఇది తన మాట కాదని సీఎం కేసీఆర్ ఖమ్మం అభివృద్ధిపై ఇలాగే చెబుతుంటారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ అవతరణ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల వద్ద ర్యాలీని ఆయన ప్రారంభించగా పారిశుద్ధ్య కార్మికులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కేఎంసీకి చేరుకున్నారు. కార్యాలయంలో సఫాయన్న, సఫాయమ్మ విగ్రహాలను ఆవిష్కరించి ఐదు ట్రాక్టర్లను, ఫాగింగ్ మిషన్లను మంత్రి ప్రారంభించారు. అలాగే, రూ.67.95 లక్షల విలువైన 100 కిలోవాట్ల సోలార్ పవర్ ప్లాంట్, గ్రిడ్‌కు అనుసంధాన ప్రాజెక్టుకు మంత్రి శంకుస్థాపన చేశారు. అతర్వాత సైన్‌బోర్డులు, స్టేట్ చాంబర్‌ను ప్రారంభించిన మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించాక మాట్లాడారు.

కేటీఆర్ ఆగడు.. మనల్ని ఆపడు..

మంత్రి కేటీఆర్ ఓ టర్బో ఇంజన్‌లా పనిచేస్తూ అందరితో పనిచేయిస్తారని మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. ఐదేళ్ల క్రితం గోళ్లపాడు చానల్ ఆధునికీకరణ పనులు మొదలుపెడితే సాధ్యం కాదన్న వారు పూర్తయ్యాక ఆశ్చర్యపోయారని తెలిపారు. ఇప్పుడు రూ.180 కోట్లతో 23కిలోమీటర్ల మేర చేపట్టే గోళ్లపాడు–2 ప్రాజెక్టుకు త్వరలోనే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయిస్తామని పేర్కొన్నారు. దీంతోపాటు మున్నేరుపై తీగల వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

ఐఏఎస్‌ల పాలనలో వేగంగా అభివృద్ధి

ప్రజల భాగస్వామ్యం ఉంటేనే పురపాలన బాగుంటుందని మంత్రి పువ్వాడ తెలిపారు. ఐఏఎస్‌ల పరిపాలన వచ్చాక మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, కార్పొరేషన్‌పై ఇప్పటి వరకు ఒక్క ఆరోపణ కూడా లేకపోవడమే నిదర్శమని చెప్పారు. ఖమ్మం అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, తన అవసరం లేదనుకున్న రోజు రాజకీయాల్లోంచి తప్పుకుంటానని పేర్కొన్నారు. అన్ని పార్టీల కార్పొరేటర్లు, అధికారులు, మేయర్ కలిసి టీమ్ వర్క్ చేయడంతోనే అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. ఇందులో భాగంగానే ఖమ్మం త్రీ టౌన్ లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించగా, గుట్టల బజార్ లో రూ. 3.48 కోట్లతో నిర్మించిన 23 లక్షల లీటర్ల సామర్థ్యంతో బహుబలి ట్యాంక్ నిర్మాణం పూర్తయిందని చెప్పారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి..

కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మంత్రి పేర్కొన్నారు. చెత్త ఎత్తేది.. మురుగు కాల్వలను శుభ్రం చేసే వారికి తెలంగాణలోనే గుర్తింపు లభించిందని తెలిపారు. కార్మికుల సేవలను ఎప్పుడు గుర్తుంచుకునేలా కేఎంసీలో సఫాయన్న, సఫాయమ్మ విగ్రహాలను ఏర్పాటు చేశామని వివరించారు.



కార్మికుల సేవలు ప్రశంసనీయం..

కోవిడ్ మహమ్మారి కాలంలో ప్రాణాలకు తెగించి పని చేసిన కార్మికుల సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. అందుకే సఫాయి కర్మచారుల్ని ముందు పెట్టి పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించామని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన విభాగంలో రాష్ట్రంలోనే ఉత్తమ నగరంగా ఖమ్మం ఎంపికైందని చెప్పారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి పీపీఈ కిట్లు పంపిణీ చేయడంతో పాటు విశిష్ట సేవలు అందించిన మున్సిపల్ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్లు రాధికాగుప్తా, మయాంక్ సింగ్, కార్పొరేటర్లు, అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డీఈ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వారికి ముఖ్యమంత్రి అభ్యర్థులెవరు?

సంక్షేమ పథకాల అమలుకు మానవతా దృక్పథంతో ఆలోచించే సీఎం కేసీఆర్.. ఆయన లాంటి యువ నాయకుడు కేటీఆర్ రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రిగా సిద్ధంగా ఉన్నారు.. కానీ కాంగ్రెస్, బీజేపీ నేతలు మాత్రం వారి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో చెప్పలేరు.. అని మంత్రి పువ్వాడ అజయ్ ఎద్దేవా చేశారు. అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నం చేస్తున్నా తాము ముందుకు వెళ్తున్నామని తెలిపారు. పంచాయతీ రాజ్ మంత్రిగా కేటీఆర్ ఉన్న సమయాన మిషన్ భగీరథ కార్యక్రమానికి అంకురార్పణ చేయగా, ఆ తర్వాత మున్సిపల్ శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న కేటీఆర్ పట్టణాలు, కార్పొరేషన్లలో అభివృద్ధి పనులను వేగిరం చేయించారని తెలిపారు. హైదరాబాద్‌కు దీటుగా ఖమ్మంలోనూ అభివృద్ధి జరగడానికి మంత్రి కేటీఆర్ కారణమని చెప్పారు.



ఖమ్మం దానవాయిగూడెం ప్రాంతంలో ఉన్న కేఎంసీ డంపింగ్ యార్డ్‌లో శుక్రవారం మంటలు చెలరేగాయి. చెత్త కుప్పల్లోంచి మధ్యాహ్నం మూడు గంటల సమయాన మంటలు చెలరేగగా సిబ్బంది అదుపులోకి తీసుకొచ్చారు. అయితే, సాయంత్రం ఆరు గంటల తర్వాత మరోమారు మంటలు రావడం, యార్డ్‌లోకి అగ్నిమాపక యంత్రం వెళ్లేందుకు వీలు లేక బోర్ల నీటితోనే సిబ్బంది మంటలు ఆర్పారు. గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకుప్పలకు నిప్పు పెట్టి ఉంటారని తెలుస్తోంది. అయితే, రాత్రి మళ్లీ మంటలు వస్తాయనే భావనతో సిబ్బంది కాపలా కాస్తున్నారు. - ఖమ్మంమయూరిసెంటర్

క్లుప్తంగా

నేడు జిల్లాలో మంత్రి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గిరిజనోత్సవం వేడుకల్లో మంత్రి పాల్గొంటారు. రఘునాథపాలెం మండలంలోని లక్ష్మీరాంతండా, దొనబండ, మంగ్యా తండా, కే.వీ.బంజర, మూలగూడెం, ఎస్.వీ.బంజర తదితర గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. అతర్వాత ఖమ్మంలో జరిగే కార్యక్రమాల్లో కూడా మంత్రి పాల్గొంటారు.

లా సెట్‌లో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంక్


నరేష్

నేలకొండపల్లి: తాజాగా వెల్లడైన లాసెట్ ఫలితాల్లో నేలకొండపల్లి జలవనరుల శాఖ ఏఈ టి.నరేష్ రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ సాధించారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ విభాగంలో గేట్ కారేపల్లికి చెందిన నరేష్ రెండో స్థానంలో నిలవడం విశేషం. ఓపక్క ఉద్యోగం చేస్తూనే న్యాయవిద్య చదవాలనే తపనతో ప్రవేశపరీక్ష రాసిన ఆయన మెరుగైన ర్యాంకు సాధించారు. బెంగళూరులోని నేషనల్ లా యూనివర్సిటీలో చదవాలన్నదే తన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

పట్టణ ప్రగతి దినోత్సవంలో భోజనాల వివాదం

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కేఎంసీ వద్ద నిర్వహించిన పట్టణ ప్రగతి దినోత్సవంలో భోజనాల వద్ద వివాదం తలెత్తినట్లు సమాచారం. సభ అనంతరం కార్మికులు, ఆర్పీలు కేఎంసీ పక్కన పార్కులో ఏర్పాటు చేసిన భోజనాల వద్దకు వెళ్లారు. అంతా ఒకేసారి రావడంతో ఇబ్బంది తలెత్తగా చివరకు కొందరు సిబ్బంది, ఆర్పీలకు భోజనాలు లేవని చెప్పారు. టోకెన్లు ఉన్న వారికే భోజనం వడ్డిస్తామని అనడంతో వారు గొడవకు దిగినట్లు తెలియగా, మెప్మా అధికారులు సర్దిచెప్పడంతో వెళ్లిపోయారని సమాచారం. అయితే, అందరికీ సరిపడా భోజనాలు ఏర్పాటుచేయకపోవడంపై కార్మికులు, ఆర్పీలు కేఎంసీ అధికారుల తీరును తప్పుపట్టారు.

అగ్నిప్రమాదంపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని తిమ్మినేనిపాలెంలో జరిగిన అగ్నిప్రమాదం ఘటనకు సంబంధించి పాపినేని యాదగిరిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఈనెల 9వ తేదీన మొక్కజొన్న చొప్పను కాల్చేందుకు నిప్పు పెట్టిన యాదగిరి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పక్కనే ఉన్న ఆయన వదిన పాపినేని లక్ష్మి తోటలోకి మంటలు వ్యాపించాయి. దీంతో 5.16 ఎకరాల్లో ఉన్న మామిడి, టేకు చెట్లు, డ్రిప్ పైపులు కాలిపోగా రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ఆమె చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై పి.వెంకన్న తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


సుంకర నరేష్ (ఫైల్)

పెనుబల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న పెనుబల్లి మండలం యడ్లబంజర్ వాసి సుంకర నరేష్(30) గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. యడ్లబంజర్ నుండి ద్విచక్రవాహనంపై పెనుబల్లి ఈనెల 11న ద్విచక్ర వాహనంపై వస్తున్న ఆయనను వెనుక నుండి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నరేష్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా మృతి చెందాడు. ఆయనకు మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యవసాయ మోటార్లు చోరీ

బోనకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతుల పొలాల్లోని వ్యవసాయ విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. ఆళ్లపాడు, రాయన్నపేట, బోనకల్‌కు చెందిన రైతులు బుంగా ఆంజనేయులు, బుంగా నరిసింహా, కరీముల్లా, బోడెపూడి ప్రమీల, చింతల శ్రీనివాసరావు పొలాల వద్ద సాగునీటి కోసం విద్యుత్ మోటార్లు అమర్చగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈమేరకు బాధిత రైతులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,750	1,200
పెసలు	7,425	6,200
కందులు	9,400	8,500
మిర్చి	20,300	12,500
ఏసీ మిర్చి	24,400	18,500
తాలు మిర్చి	13,000	8,000
పత్తి	6,800	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,346

సత్తుపల్లి రూపురేఖలు మారాయి..

- కలెక్టర్ వీపీ గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- అంబురాన్ని అంటిన పట్టణ ప్రగతి సంబురాలు


సత్తుపల్లిలో భారీ బతుకమ్మలు, శకటాలతో నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే వెంకటవీరయ్య, కౌన్సిలర్లు, నాయకులు


పారిశుద్ధ్య కార్మికురాలి రూపంతో తీర్చిదిద్దిన బతుకమ్మ వద్ద కలెక్టర్

సత్తుపల్లిటౌన్: గడిచినతొమ్మిదేళ్లలో చిన్న ఊరు పెద్ద నగరంగా మారినట్టుగా అభివృద్ధి పనులతో సత్తుపల్లి రూపురేఖలు మారాయని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సత్తుపల్లిలో శుక్రవారం రాత్రి పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈమేరకు నిర్వహించిన భారీ ర్యాలీని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. విశాలమైన రోడ్లు, మాల్స్‌తో సత్తుపల్లి అభివృద్ధిలో దూసుకెళ్తోందన్నారు. కరోనా సమయంతో పాటు అన్నివేళలా సఫాయి కార్మికుల సేవలు అమూల్యమైనవని గుర్తించిన ప్రభుత్వం వేతనాలు పెంచిందని తెలిపారు. ఇక్కడ టీఎస్ఎఫ్ఐడీసీలో ఇప్పటికే రూ.26 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుండగా, ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం వచ్చిన సందర్భంగా రూ.30 కోట్లు మంజూరు చేశారన్నారు. టీఎస్‌బీపాస్‌లో మంత్రి కేటీఆర్ మంచి సంస్కరణలు తీసుకురావడంతో అవినీతికి తావులేకుండా పాలన జరుగుతోందని తెలిపారు.

రూ.171కోట్లతో అభివృద్ధి : ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో సత్తుపల్లి మున్సిపాలిటీలో ఇప్పటి వరకు రూ.171.61 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ దూరదృష్టి వల్ల అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. రూ.5 కోట్లతో సత్తుపల్లికి స్టేడియం మంజూరైందని తెలిపారు. అనంతరం సఫాయి కార్మికులకు పూలాభిషేకం చేసి సత్కరించారు. పట్టణంలోని 29 స్వయం సహాయక సంఘాలకు రూ.2.80 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను అందించారు. ముందుగా స్థానిక జీవీమాల్ ప్రాంగణం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ బతుకమ్మలు, మున్సిపల్ అభివృద్ధి పనులను తెలిపే శకటాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కమిషనర్ కె.సుజాత, ఎంపీపీలు దొడ్డా హైమావతి, అలేఖ్య, కొత్తూరు ఉమామహేశ్వరరావు, వనమా వాసు, ఎస్.కే.రఫీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు పెండింగ్ ఉండొద్దు

- మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు అందేలా చూడండి
- జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కమల్‌రాజ్, పక్కన సీఈఓ అప్పారావు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని పాఠశాలల్లోమన ఊరు – మన బడి, మన బస్తీ – మన బడిలో భాగంగా చేపట్టిన పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని జెడ్పీ పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సూచించారు. జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన స్థాయీ సంఘాల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేసేందుకు మంజూరు చేసిన పనులను త్వరగా పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అలాగే, మహిళా సంఘాల సభ్యులకు పావలా వడ్డీ రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, కంటివెలుగు రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేలా పర్యవేక్షించిన డీఎంహెచ్‌ఓ మాలతిని అభినందించారు. కాగా, ఉదయం జరిగిన మూడో స్థాయీ సంఘం సమావేశానికి జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి అధ్యక్షత వహించగా తిరుమలాయపాలెం జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాసరావు వర్షాకాలంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఆతర్వాత జరిగిన రెండో స్థాయీ సంఘం సమావేశంలో మహిళా సంఘాల సభ్యులకు పావలావడ్డీ రుణాలు అందించాలని జెడ్పీ చైర్మన్ సూచించారు. అలాగే, 1, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు జరగగా, 5, 6వ సంఘాలకు కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. ఈసమావేశంలో జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మధిరలో రూ.100 కోట్లతో అభివృద్ధి

ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు


మధిరలో పట్టణ ప్రగతి దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

మధిర: పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా మధిర మున్సిపాలిటీలో రూ.100 కోట్ల విలువైన అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు వెల్లడించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మధిరలో శుక్రవారం నిర్వహించిన పట్టణ ప్రగతి దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని, రానున్న రోజుల్లో కేసీఆర్‌కు అండగా ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి వచ్చేలా గెలిపించాలని కోరారు. జిల్లాలో పదికి పది స్థానాలను గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో మధిర మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పాలకవర్గం నెరవేర్చిందన్నారు. మధిర చెరువు కట్టపై ట్యాంక్‌బండ్, సమీకృత మార్కెట్ నిర్మించగా, వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసి మున్సిపల్ కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, అదనపు కలెక్టర్ స్నేహలత, మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోకలత, వైస్ చైర్‌పర్సన్ శీలం స్నేహలత, కమిషనర్ అంబటి రమాదేవి, రైతుబంధు సమితి జిల్లా నల్లమల వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ సిలార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

భట్టి యాత్రకు ఎస్‌టీఎఫ్ సంఘీభావం


భట్టికి వినతిపత్రం ఇస్తున్న దేవరకొండ సైదులు తదితరులు

ఖమ్మంసహకారనగర్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క నిర్వహిస్తున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు ఎస్‌టీఎఫ్ బాధ్యులు సంఘీభావం తెలిపారు. నల్లగొండ జిల్లాలో భట్టిని కలిసిన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. పాఠశాలల్లోని సమస్యల పరిష్కారంతో పాటు ఉపాధ్యాయుల నియామకం, బదిలీలు, పదోన్నతులు చేపట్టేలా సహకరించాలని భట్టిని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మహబూబ్, సురేశ్‌బాబు, ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.యాదగిరి, మన్సూర్‌తో పాటు పోతగాని వెంకన్న, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఘర్షణ


వీఆర్‌ఏలతో మాట్లాడుతున్న తహసీల్దార్ మీనన్

కూసుమంచి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, వీఆర్ఏ మధ్య శుక్రవారం ఘర్షణ చోటుచేసుకుంది. బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకునే వారు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం పెద్ద సంఖ్యలో కార్యాలయానికి వస్తున్నారు. ఈ క్రమంలో ఆన్‌లైన్ చేసే విషయంలో వీఆర్ఏ అన్వర్, జూనియర్ అసిస్టెంట్ యాసిన్ మధ్య వాగ్వాదం జరిగి పరస్పరం తోసుకోగా ఇతర సిబ్బంది వారించారు. అనంతరం కార్యాలయం బయట దివ్యాంగుడైన వీఆర్ఏ నరేశ్‌ను అన్వర్ దరఖాస్తులు ఎందుకు ఆన్‌లైన్ చేస్తున్నావంటూ నెట్టేసినట్లు చెబుతున్నారు. ఈ ఘటనతో తహసీల్దార్ మీనన్ ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ రమేశ్‌కుమార్ చేరుకుని వివరాలు ఆరా తీశారు. వీఆర్ఏ అన్వర్ దురుసుగా ప్రవర్తించి ఘర్షణకు దిగినట్లు సిబ్బంది చేసిన ఫిర్యాదుతో స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే, ఎంపీపీ శ్రీనివాస్ కూడా కార్యాలయానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనపై తహసీల్దార్ మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో సిబ్బంది ఘర్షణ పడి ఉండొచ్చని, క్రమశిక్షణ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించొద్దు


తహసీల్దార్‌కు వినతిపత్రాలు ఇస్తున్న గ్రామస్తులు

వేంసూరు: గ్రామ ప్రజల అవసరాల కోసం కేటాయించిన భూమిలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టొద్దని మండలంలోని కల్లూరుగూడెం వాసులు కోరారు. ఈమేరకు ఫ్యాక్టరీ నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ నారాయణమూర్తి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ సాముహిక పట్టా భూమిలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్ఐ గ్రామసర్పంచ్‌తో తెల్లకాగితంపై సంతకం చేయించుకుని ఆయనకు నచ్చినట్లుగా పంచనామా రాసుకున్నందున ఆర్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

దేశద్రోహం కేసుల నమోదు సరికాదు..


అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న చైతన్యవేదిక, స్పర్శ వేదిక బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్/ఖమ్మం అర్బన్/ఖమ్మం మామిళ్లగూడెం: హక్కుల నేత, విద్యావేత్త, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులపై రాష్ట్ర ప్రభుత్వం ఉపా చట్టం కింద దేశ ద్రోహం కేసు నమోదు చేయడం గర్హనీయమని వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పేర్కొన్నారు. మేధావులు, బుద్ధిజీవులు, ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదని తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ పద్మజాషా, పీఓడబ్ల్యూ నేత సంధ్య, అరుణోదయ విమలక్క తదితరులపై ఉపా చట్టం కింద నమోదు చేసిన కేసును వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌తో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు శుక్రవారం ఖానాపురం హవేలీ సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. నాయకులు బి.ఝాన్సీ, చందు, సీహెచ్.శిరోమణి, నామాల ఆజాద్, కంకణాల శ్రీనివాస్, కోయల శ్రీనివాస్, వి.వెంకటేష్ పాల్గొన్నారు. అంతేకాకుండా చైతన్యవేదిక, స్పర్శ వేదికల బాధ్యులు తాళ్లూరి వేణు, కాకి భాస్కర్ ఆధ్వర్యాన జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో ఎన్డీ, పీడీఎస్‌యూ, టీపీటీఎఫ్ నాయకులు గిరి, శోభ, హన్మంతరావు, సురేష్, మస్తాన్, శ్రీకాంత్, బాబురావు, పూర్ణచందర్‌రావు, సురేష్, తేజ, బచ్చు నాయక్, యాకూ, పాల్గొన్నారు. కాగా, హక్కుల నేతలు, సామాజిక కార్యకర్తలపై కేసు నమోదు చేయడం గర్హనీయమని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, పోటు ప్రసాద్, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

60 కేజీల గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం మీదుగా రవాణా చేస్తున్న 60.7 కేజీల గంజాయిని శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని కొత్త బస్టాండ్ పక్కన ఉన్న పెట్రోల్ బంక్ సమీపాన పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ లేలాండ్ ట్రాలీ వద్ద ఉన్న ఓ వ్యక్తి పారిపోతుండగా పట్టుకుని విచారించగా కొణిజర్ల మండలం లక్ష్మీపురానికి చెందిన కొర్రా సాయికుమార్‌గా తేలింది. గంజాయి వ్యాపారి సైదులు వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న సాయికుమార్ ఈనెల 9న డొంకరాయి వెళ్లి ఓ వ్యక్తి నుంచి వాహనం తీసుకుని గంజాయి లోడ్‌తో వచ్చినట్లు గుర్తించారు. అయితే, లోడ్ ఎక్కడకు చేర్చాలో సైదులును అడిగేందుకు వచ్చిన ఆయన పట్టుబడగా రూ.9 లక్షల విలువైన 60.7 కేజీల గంజాయి, ట్రక్‌ను సీజ్ చేసినట్లు ఏఎస్సై బీమా, కానిస్టేబుల్ రాములు తెలిపారు.

ప్రేమించి కాదన్నాడని యువతి దీక్ష

నేలకొండపల్లి: ప్రేమ పేరిట నమ్మబలికిన యువకుడి మాటలకు పొంగిపోయి సర్వం అర్పించిన యువతిని ఇప్పుడు కాదంటుండడంతో ఆయన ఇంటి ఎదుట దీక్షకు దిగింది. మండలంలోని ముజ్జుగూడెంకు చెందిన విద్యార్థిని తల్లిదండ్రులు చనిపోవడంతో నాయనమ్మ పోషిస్తుంది. సూర్యాపేట జిల్లా కోదాడలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న యువతిని ఆమె ఇంటి ఎదురుగా ఉండే శ్రీనివాసరావు నాలుగేళ్ల క్రితం ప్రేమ పేరుతో నమ్మించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి లోబర్చుకున్న ఆయన ఇప్పుడు నిరాకరిస్తున్నాడు. కుల పెద్దలు పంచాయితీ చేసినా ససేమిరా అనడంతో యువతి తన బంధువులతో శ్రీనివాసరావు ఇంటి వద్ద దీక్షకు దిగింది. న్యాయం జరిగే వరకు కదిలేది లేదని యువతి స్పష్టం చేయగా.. ఆమెకు సంఘీభావంగా దీక్షలో స్థానికులు పలువురు పాల్గొన్నారు. ఈ విషయమై శ్రీనివాసరావుతో మాట్లాడేందుకు యత్నించగా నిరాకరించాడు.

మంటలు చెలరేగి ట్రాక్టర్ దగ్ధం


కాలిపోయిన ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

ఏన్కూరు: ఇంజన్‌లో మంటలు చెలరేగడంతో ట్రాక్టర్ దగ్ధమైన ఘటన మండలంలోని పరిధిలోని జన్నారం ఎస్టీ కాలనీ సమీపంలో శుక్రవారం జరిగింది. కొణిజర్ల మండలం ఉప్పలచిలకకు చెందిన గుగులోతు నరేష్ ట్రాక్టర్‌తో ఏన్కూరు వస్తుండగా ఎస్టీ కాలనీ వద్ద ఇంజన్ నుండి మంటలు వచ్చాయి. దీంతో నరేష్‌తో పాటు ట్రాక్టర్‌లో మంగ్యా దిగిపోయారు. ఆ వెంటనే మంటలు పెద్దవై ట్రాక్టర్ పూర్తిగా కాలిపోగా ఎస్ఐ బాదావత్ రవి చేరుకుని పరిశీలించారు. ఎండవేడి కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

అనారోగ్యం, వడదెబ్బతో వ్యక్తి మృతి

ఖమ్మంఅర్బన్: నగరంలోని పుట్టకోటకు చెందిన రెడ్డిబోయిన రామకృష్ణ(55) అనారోగ్యంతో పాటు, వడదెబ్బ ప్రభావంతో శుక్రవారం మృతి చెందాడు. నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ సమీపాన సిమెంట్ కాంపౌండ్‌వాల్స్ తయారీ ఫ్యాక్టరీలో వాచ్‌మేన్‌గా చేస్తున్న రామకృష్ణ అక్కడే నివాసముంటున్నాడు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆయన వడదెబ్బ బారిన పడడంతో నిద్రలోనే మృతి చెందాడు. ఈమేరకు మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కల్లూరు మండలంలో ముగ్గురు..

కల్లూరు: కల్లూరు మండలంలో ఎండల తీవ్రతతో వడదెబ్బ బారిన పడిన ముగ్గురు శుక్రవారం మృతి చెందారు. కల్లూరు అంబేద్కర్‌నగర్‌కు చెందిన రజక వృత్తిదారుడు అల్లాడి కృష్ణ(56), లక్ష్మీపురానికి చెందిన రైతు సవరం చిన్న వెంకటేశ్వర్లు(60) వడదెబ్బ బారిన పడగా కుటుంబీకులు చికిత్స చేయిస్తుండగానే కన్నుమూశారు.

బజాజ్ షోరూంలో అగ్నిప్రమాదం

- రూ.10 లక్షలకు పైగా ఆస్తినష్టం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

ఖమ్మంఅర్బన్: ఖమ్మం మమతా రోడ్డులోని వీవీసీ గ్రూప్స్‌కు చెందిన బజాజ్ షోరూంలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. సెంట్రల్ ఏసీ యూనిట్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఉన్న సిబ్బంది వాహనాలను బయటకు తీయడంతో పెనుప్రమాదం తప్పింది. అయితే, అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పేలోగా సెంట్రల్ ఏసీ యూనిట్‌తో పాటు ఫర్నీచర్, ఇతర సామగ్రి కలిపి సుమారు రూ.10లక్షల పైగా నష్టం వాటిల్లినట్లు గుర్తించారు.

క్లుప్తంగా...

19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల సెప్టెంబర్ కోటా విడుదల

తిరుమల: టీటీడీ షెడ్యూల్ ప్రకారం తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల సెప్టెంబర్ నెల కోటాను ఈ నెల 19న విడుదల చేయనుంది. భక్తులు https:// tirupatibalaji. ap. gov. in వెబ్‌సైట్‌లో వీటిని బుక్ చేసుకోవచ్చు. అలాగే సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళపాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదుకు అవకాశం ఉంది. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన వాళ్లు సొమ్ము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవా టికెట్లను 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవ వర్చువల్ సేవల కోటాను, వాటికి సంబంధించిన దర్శన టికెట్ల కోటాను 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్టు 27 నుంచి 29వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాల సేవా టికెట్ల కోటాను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

హక్కుల ఉద్యమ నేత కుక్కల ఏసు కన్నుమూత



లబ్బీపేట (విజయవాడ తూర్పు): పేదల సమస్యలపై నిరంతరం ఉద్యమించిన హక్కుల ఉద్యమ నేత, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సమితి(ఓపీడీఆర్) ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు, సీపీఐ (ఎంఎల్) నేత కుక్కల ఏసు (75) మరణించారు. విజయవాడ 24వ డివిజన్‌లో న్యూ గిరిపురంలో నివసించే ఏసు వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా గురువారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఆయన భార్య 20 ఏళ్ల కిందటే మరణించగా, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏసు ఎయిడెడ్ కళాశాలలో నాల్గవ తరగతి ఉద్యోగిగా పనిచేస్తూనే సీపీఐ (ఎంఎల్), ఓపీడీఆర్‌లో చురుగ్గా వ్యవహరించారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 14 పేటలకు సంబంధించి స్మశాన వాటిక ఆక్రమణలకు గురికాగా, దానికోసం వీరోచితంగా ఉద్యమం నడిపారు. ఈ విషయంలో అనేక పర్యాయాలు అరెస్ట్ కూడా అయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్మశాన వాటికను సాధించగలిగారు.



కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన సభకు భారీగా హాజరైన జన సందోహంలో ఓ భాగం

ఇళ్ల యజ్ఞం | ఊళ్లకు ఊళ్లే నిర్మాణం

నాలుగేళ్లుగా పేదల అభ్యున్నతే లక్ష్యంగా అడుగులు ముందుకు

గుడివాడలో టిడ్కో ఇళ్ల అప్పగింత కార్యక్రమంలో సీఎం జగన్

దేవుడి దయతో, మీ అందరి ఆశీర్వాదంతో మనం అధికారంలోకి రాగానే 300 అడుగుల టిడ్కో ఇళ్లను కేవలం ఒక్క రూపాయికే ఇస్తామని గతంలో ఇదే గుడివాడ బహిరంగ సభలో చెప్పాను. ఈ రోజు ఆ మాటను నిజం చేసి చూపిస్తున్నా. ఇవిగో ఆ ఇళ్లు.. ఇవిగో ఆ ఊళ్లు. టిడ్కో ఇళ్ల ద్వారా అక్కచెల్లెమ్మల కుటుంబాలకు మన ప్రభుత్వం రూ.16,601 కోట్లు లబ్ధి చేకూర్చుతూ ఖర్చు భరిస్తోంది. ఇందులో చంద్రబాబు చేసింది ఏమిటి? గుమాస్తాగిరీ కూడా సరిగా చేయలేదు. నిస్సిగ్గుగా తాను చేయని పనులు చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. నోరు విప్పితే అబద్ధాలే.

– సీఎం వైఎస్ జగన్



ఇంటి హక్కు పత్రాలను అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఏపీలో ఇళ్ల నిర్మాణ యజ్ఞం కొనసాగుతోందని, ఏకంగా ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల అభ్యున్నతే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నామని చెప్పారు. కృష్ణా జిల్లా గుడివాడ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం 77 ఎకరాల ఒకే లేఅవుట్‌లో పూర్తయిన 8,912 టిడ్కో ఇళ్లను ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొని, ఇంటి హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకంగా 30.60 లక్షల ఇంటి పట్టాలు అందజేశామని, ఇళ్లు కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పేదలను అప్పులపాలు చేయాలని చూస్తే, మనందరి ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేశామని చెప్పారు. అక్కచెల్లెమ్మలు హక్కుదారులుగా ఆయా కుటుంబాల చరిత్రను మార్చేలా ఇవాళ మనం ఊళ్లకు ఊళ్లు నిర్మిస్తున్నామని చూపించే గొప్ప కార్యక్రమం గుడివాడలో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

కొత్త గుడివాడ కనిపిస్తోంది

- ఒకవైపు టిడ్కో ఇళ్లు.. మరోవైపు మనం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు చూస్తుంటే.. ఇక్కడ కొత్త గుడివాడ నగరం కనిపిస్తోంది. మొత్తం 257 ఎకరాల్లో రూ.800 కోట్లతో 8,912 ఇళ్లు కట్టడమే కాకుండా.. వాటిని నా అక్కచెల్లెమ్మలకు ఇచ్చే కార్యక్రమం ఇవాళ చేస్తున్నాం. ఇదే లే అవుట్‌లో 7,728 ఇళ్ల స్థలాలను ఇళ్లు లేని నా నిరుపేద అక్కచెల్లెమ్మలకు ఇచ్చాం. మొత్తంగా 16,640 కుటుంబాలు ఇక్కడ నివాసం ఉండబోతున్నాయి.
- ఈ లేఅవుట్‌తో పాటు నియోజకవర్గం మొత్తం 13,145 మందికి ఇళ్ల పట్టాలిచ్చాం. వీటికి 8,912 టిడ్కో ఇళ్లు కూడా కలిపితే 22 వేల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలిచ్చామని చెబుతున్నా.
- ఒక్కో ఇంటిని రూ.2.70 లక్షలతో కడుతున్నాం. అక్కడ డ్రెయిన్లు, రోడ్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.6 లక్షలు ఖర్చవుతుంది. ఈ లెక్కన ఇంటి నిర్మాణం పూర్తయితే కనీసం రూ.10–15 లక్షలు వాళ్ల చేతుల్లో పెట్టినట్టవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా 30.60 లక్షల ఇళ్లు కూడా చూసుకుంటే మహాయజ్ఞం ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల కోట్ల ఆస్తిని అక్కచెల్లెమ్మల చేతిలో పెడుతున్నాం.
- ఇవాళ ఇచ్చిన పట్టాలకు సంబంధించి 4,200 ఇళ్లు మంజూరైతే మొత్తం 13,145 ఇళ్ల పట్టాలలో కూడా ఇళ్లు వస్తాయి. జూలై 8.. నాన్న గారి జయంతి రోజున ఈ ఇళ్లు కూడా మంజూరు చేస్తాం.

టిడ్కో ఇళ్ల పేరుతో నాడు పేదలపై భారం

- ఈ రాష్ట్రంలో కొంతమందికి ఈర్ష, ద్వేషం ఎక్కువయ్యాయి. ఏ మాత్రం కళ్లార్పకుండా అబద్ధాలు చెబుతున్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గత చంద్రబాబు ప్రభుత్వం చేసిన నిర్వాకమిది. నిరుపేదలు నివాసం ఉండే 300 చదరపు అడుగుల ఫ్లాట్ కట్టడానికి అయ్యే ఖర్చు అడుగుకు రూ.2 వేలు చొప్పున ఒక్కో ఫ్లాట్‌కు దాదాపు రూ.5.75 లక్షలు, మౌలిక సదుపాయాలకు మరో రూ.లక్ష అవుతుంది. రూ.6.75 లక్షలు ఖర్చయ్యే ఒక్కో ఫ్లాట్‌కు కేంద్రం రూ.1.50 లక్షలు ఇస్తే రాష్ట్రం రూ.1.5 లక్షలు ఇస్తోంది. మిగిలిన రూ.3 లక్షలు చంద్రబాబు హయాంలో పేద వాడి పేరు మీద అప్పుగా రాశారు. ప్రతి నెలా రూ.3 వేలు 20 ఏళ్ల పాటు పేదవాడు కడుతూపోవాలి.
- మీ బిడ్డ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 300 చదరపు అడుగులలో నిర్మిస్తున్న 1,43,600 టిడ్కో ఇళ్లను అన్ని హక్కులతో ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నాం. రూ.6.75 లక్షలయ్యే ఒక్కో ఇంటిని అక్కచెల్లెమ్మల పేరుతో ఇస్తున్నాం.

పేదల వ్యతిరేకి చంద్రబాబు

- నాలుగేళ్లలో మన ప్రభుత్వం ఇన్ని లక్షల ఇళ్లు ఎలా కట్టగలిగింది? 30 లక్షల ఇళ్ల స్థలాలు ఎలా ఇవ్వగలిగింది? ఇదే పని 30 ఏళ్ల క్రితమే సీఎం అయిన చంద్రబాబు, మూడుసార్లు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న ఈ బాబు, 14 ఏళ్లు సీఎంగా ఉండి కూడా ఎందుకు చేయలేకపోయారు? కారణం చంద్రబాబు పేదల వ్యతిరేకి కాబట్టి చేయలేదు.
- 40 ఏళ్ల రాజకీయ జీవితం తర్వాత కూడా ప్రజలకు మంచి చేసిన చరిత్ర లేని చంద్రబాబుకు రెండు పక్కలా రెండు పార్టీలు ఉంటే తప్ప లేచి నిలబడలేని పరిస్థితి. ఇలాంటి ఈ చంద్రబాబు.. 175 నియోజకవర్గాల్లో 175 మంది అభ్యర్థులను కూడా పెట్టలేని ఈ చంద్రబాబు మనకు ప్రత్యర్థి అట! రాజకీయాల్లోకి వచ్చి 15 ఏళ్ల తర్వాత కూడా తాను చంద్రబాబు కోసమే పుట్టానంటున్నట్లు ప్రవర్తిస్తున్న ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు మరో వంక. తన జీవితమే బాబు కోసమని, తన వ్యాన్‌ను చూసి మురిసిపోతూ, ఇక తాను కూడా ఎమ్మెల్యే అవుతానని, తనను ఎవరు ఆపుతారో చూస్తానంటున్నారు. వీరికితోడు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5.. మొత్తంగా గజ దొంగల ముఠా మళ్లీ రాష్ట్రాన్ని దోచుకోవాలని ప్రజల ముందుకు వస్తోంది. మీరంతా ఈ దుష్టచతుష్టయం అబద్ధాలను నమ్మకండి. మీ ఇంట్లో మీకు మంచి జరిగిందా? లేదా? అన్నది మాత్రమే కొలమానంగా తీసుకోండి. మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు సైనికులుగా మారండి.

సీఎం కావడానికి నేను సిద్ధమే

- 14 ఏళ్ల వనవాసం పూర్తయ్యింది
- సంపూర్ణ అధికారం ఇచ్చి సీఎం స్థానం ఇవ్వండి
- వారాహి యాత్రలో జనసేన అధ్యక్షుడు పవన్



పిఠాపురంలో పవన్ ప్రసంగిస్తుండగానే వెళ్లిపోతున్న అభిమానులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సీఎం కావడానికి తాను సిద్ధంగా ఉన్నానని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పారు. తన 14 సంవత్సరాల వనవాసం పూర్తయిందని, ఈ సారి అంతా జనసేన వైపు చూడండని అన్నారు. వారాహి యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో జరిగిన వారాహి సభలో పవన్ మాట్లాడారు. తనకు సంపూర్ణ అధికారం ఇచ్చి సీఎం స్థానం ఇస్తే దేశంలో ఉన్నతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఏ పదవీ లేకున్నా ప్రజల కోసం పోరాడుతూనే ఉన్నానని చెప్పుకొచ్చారు. నాడు తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఉంటే ఈ రోజు ఇలా ఉండేది కాదన్నారు. శక్తిపీఠం సాక్షిగా చెబుతున్నానని, ఆంధ్రా వీడి వెళ్లనని, సురక్ష ఆంధ్రాగా తీర్చిదిద్దుతానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ దుష్ట ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. జనసేన అధికారంలోకి వస్తే మొదటగా రాష్ట్రంలో శాంతిభద్రతలను గాడిలో పెడుతుందన్నారు. రాష్ట్రంలో 219 హిందూ ఆలయాను కూల్చివేస్తే ఈ ముఖ్యమంత్రి, ఈ ప్రభుత్వం ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేకపోయిందన్నారు. హిందువులు ప్రపంచంలో మైనార్టీలన్నారు. తవ్వేకొద్దీ వైఎస్సార్‌సీపీ అవినీతి బయటపడుతుందని అన్నారు. తిరుపతి శ్రీవాణి ట్రస్ట్ నిధులను అడ్డగోలుగా దోచేస్తున్నారని విమర్శించారు. మన కులపోడు అని చూడకూడదని, ఆంధ్రా బాగుపడాలంటే సరైనోడు కావాలి అనుకోండి అని అన్నారు.

ఎన్నికల్లో పోటీపై స్పష్టత ఉందా పవన్?

- సీఎం అవ్వాలనుకుంటున్నావా? లేదా?
- సగం స్థానాల్లోనైనా అభ్యర్థులను నిలబెడతావా? సింగిల్ పోటీ చేస్తావా?
- మంత్రి అంబటి రాంబాబు సూటి ప్రశ్నలు



సాక్షి, రాజమహేంద్రవరం: ఎన్నికల్లో పోటీపై జనసేన నేత పవన్ కల్యాణ్‌కు స్పష్టత ఉందా అని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. '175 స్థానాల్లో జనసేన పోటీ చేస్తుందా? సగం స్థానాల్లోనైనా బరిలోకి దిగుతారా? సింగిల్‌గా పోటీ చేస్తావా' అన్న క్లారిటీ పవన్ ఇవ్వాలని అన్నారు. మంత్రి రాంబాబు శుక్రవారం రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చి హీరో అనిపించుకున్న వ్యక్తి ఎన్టీఆర్ అయితే.. పవన్ కామెడీ యాక్టర్ అయ్యాడని విమర్శించారు. ప్రశ్నించేందుకే పార్టీ పెట్టిన పవన్ ఐదేళ్ల టీడీపీ పాలనలో ఎవరిని ప్రశ్నించారని దుయ్యబట్టారు. మంచి పనులు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను, వైఎస్సార్‌సీపీని ప్రశ్నించేందుకే పార్టీ నడుపుతున్నారని అన్నారు. పవన్ గతంలో పొత్తులన్నారని, ఇప్పుడేమో లేదంటున్నారని, పర్యటనకో మాట మారుస్తున్నారని చెప్పారు. సీఎం అభ్యర్థి ఆయన కాదని చెప్పిన పవన్.. 2024, 2029 ఎన్నికల్లో గెలిపించాలని చెప్పడం ఆయన చంచల మనస్తత్వానికి నిదర్శనమన్నారు. కేవలం అసెంబ్లీలో అడుగు పెట్టేందుకే రాజకీయం చేస్తున్నారా? ఆయనకు సీఎం అవ్వాలని ఉందా? లేదా? చంద్రబాబును సీఎం చేసేందుకు యాత్రలు చేస్తున్నారా సూటిగా చెప్పాలని అన్నారు. ఎక్కడ నిలబడతాడో కూడా తెలియని వ్యక్తితో జన సైనికులు, వీర మహిళలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఏ విషయంలోనూ స్పష్టత లేని పవన్‌తో సావాసం కుక్కతోకను పట్టుకుని గోదావరి ఈదినట్లేనన్నారు. పవన్ రాజకీయాలకు పనికిరాడని స్పష్టంగా చెప్పారు. చిరంజీవి పార్టీ పెట్టి 18 సీట్లు గెలిచారని, రాజకీయాల్లో నిలబడలేనని నిష్క్రమించి గొప్ప నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రాష్ట్రాన్ని పాలించాలనుకున్న పార్టీ అధినేత ఎక్కడైనా చెప్పులు చూపిస్తారా అని ప్రశ్నించారు. పవన్, చంద్రబాబు, బీజేపీ కలిసి పోటీ చేసినా వచ్చే ఎన్నికల్లో విజయం వైఎస్ జగన్‌దేనని చెప్పారు. పవన్, చంద్రబాబువి ఉడత ఊపులేనన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్లో 98 శాతం అమలు చేసిన జగన్ పక్షానే పేదలు ఉన్నారని తెలిపారు.

జిల్లా వార్తలు

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు



కల్లూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మధిర స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు సర్టిఫికెట్లతో మీ సేవ కేంద్రం లేదా టీఎస్ ఆన్‌లైన్‌లో జూలై 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే, డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థులు కూడా జూలై 31లోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు.

మద్దతు ధరపై కేంద్రం తీరు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

అశ్వారావుపేటరూరల్: పంటల మద్దతు ధరలపై కేంద్ర ప్రభుత్వం తీరు సరిగ్గా లేదని, గతంలో వ్యవసాయ చట్టాలపై చేసిన పోరాటాల కారణంగా మోదీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ ఆరోపించారు. అశ్వారావుపేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రైతు సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సుదర్శన్ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు సరైన మద్దతు ధర ప్రకటించకుండా మోసం చేశారని పేర్కొన్నారు. అలాగే, రైతులకు సబ్సిడీలు, మద్దతు ధరలో కోత పెట్టిన కేంద్రానికి తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమవుతోందని తెలిపారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం 11లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు 4లక్షల ఎకరాలకే పరిమితం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, ధరణి వెబ్‌సైట్‌లో లోపాలను సవరించాలనే డిమాండ్‌తో త్వరలోనే పాదయాత్రలు, దీక్షలు చేపడతామని తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి, నాయకులు మూడ్ శోభన్, కొక్కెరపాటి పుల్లయ్య, యలమంచిలి వంశీ కృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, చిరంజీవి, పిట్టల అర్జున్ పాల్గొన్నారు.

అన్నదాతలకు 'మద్దతు'తో ఊరట



పత్తి పంట (ఇన్‌సెట్) వరి పంట

- పంటలకు మద్దతు ధరలు పెంచిన కేంద్రం
- ధాన్యం క్వింటాకు రూ.143, పత్తికి రూ.640 పెరుగుదల
- అపరాల పంటలకు మరింత...

పాల్వంచరూరల్: ఈ ఏడాది రైతులు సాగు చేయనున్న పంటలకు సంబంధించి కేంద్రప్రభుత్వం తాజాగా మద్దతు ధరలు ప్రకటించింది. పెట్టుబడితో పోలిస్తే ఈ ధరలు ఆశాజనకంగా లేకున్నా.. గతేడాది చూస్తే కాస్త మెరుగ్గా పెరగడంపై రైతులు వర్షం వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్ మొదలవుతున్న తరుణాన కేంద్రం సవరించిన మద్దతు ధరలను వెల్లడించింది. ఏటా కమిషన్ ఆఫ్ అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైసెస్ సిఫారసు మేరకు కేంద్రప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయిస్తుంది. మార్కెట్‌లో ఆహార ఉత్పత్తుల ధరలు పతనమైనప్పుడు మద్దతు ధరలు రైతులను గట్టెకిస్తాయి. మార్కెట్లలో ఇంతకంటే ధర తక్కువగా పలికితే ప్రభుత్వ రంగం సంస్థలు రంగంలోకి దిగి మద్దతు ధరతో పంటలు కొనుగోలు చేస్తాయి.

పప్పు దినుసులకు ప్రాధాన్యం

వరి, పత్తి తదితర పంటల మద్దతు మద్దతు ధరలను కేంద్రప్రభుత్వం సవరించింది. వీటితో పోలిస్తే పప్పు దినుసుల పంటలకు మరింత ప్రాధాన్యత ఇచ్చారు. కంది క్వింటాకు రూ.7వేలు, పెసరకు రూ.8,558, వేరుశనగకు రూ.6,377, మినుములు రూ.6,950గా ధర నిర్ణయించారు. ఇక నువ్వుల పంట అధికంగా క్వింటా ధర రూ.8,635గా ఖరారు చేయడం విశేషం.

కేంద్రప్రభుత్వం పెంచిన మద్దతు ధరలు వివరాలు... (క్వింటాకు రూ.ల్లో)

పంట	గత సంవత్సరం	ఈ ఏడాది	పెంపు
నువ్వులు	7,830	8,635	805
పెసర	7,755	8,558	803
పత్తి	6,380	7,020	640
వేరుశనగ	5850	6,377	527
కంది	5,850	7,000	400
పొద్దుతిరుగుడు	6,430	6,760	360
మినుములు	6,600	6,950	350
రాగులు	3,578	3,864	268
జొన్న	2,990	3,225	235
వరి	2,060	2,203	143
మొక్కజొన్న	1,962	2,090	128

గత ఏడాది కంటే అధికమే..



కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మద్దతు ధరలు గతేడాదితో పోలిస్తే అధికంగానే ఉన్నాయి. పత్తి, వరి, పెసర, కంది, సజ్జ, మొక్కజొన్న, రాగులకు మంచి ధర ప్రకటించారు. పెట్టుబడి, రైతుల జీవన వ్యయం ఆధారంగా మద్దతు ధరలను ఏటా నిర్ణయిస్తారు.

– అబ్దుల్ అలీ, జిల్లా మేనేజర్, మార్కెటింగ్ శాఖ

మద్దతు ధరల పెంపుతో ఊరట



కేంద్ర ప్రభుత్వం రెండేళ్లుగా ప్రకటిస్తున్న మద్దతు ధరలను పరిశీలిస్తే ఈ ఏడాది ఆశాజనకంగా ఉన్నాయి. గత ఏడాది 'ఏ' గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,060 ఉంటే ఈసారి ధర రూ.2,203కు చేరింది. పత్తి ధర రూ.6,380 నుంచి రూ.7,020కు పెరగడం హర్షణీయం.

– నాగిరెడ్డి, ప్రభాత్‌నగర్

కాస్త గిట్టుబాటు అవుతుంది..



ధాన్యం మద్దతు ధర రూ.143 పెంచడంతో కాస్త గిట్టుబాటు అవుతుంది. మిగిలిన వాణిజ్య పంటల ధరలు బాగా పెంచారు. పంటలకు గతంలో కంటే పెట్టుబడులు పెరుగుతున్నాయి. వీటితో పోలిస్తే మద్దతు ధర సరిపోకున్నా ఈసారి పెంపు కాస్త నయమనే చెప్పాలి.

– తెల్లం మల్లేష్, రైతు, దంతలబోరు

వరుణుడు కరుణించాలని..

పాల్వంచరూరల్: వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిపించాలని కోరుతూ మండలంలోని జగన్నాథపురంలో శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతీ ఇంటి నుంచి మహిళలు జలబిందెలతో బయలుదేరి బొడ్రాయి, ముత్యాలమ్మ దేవతకు అభిషేక పూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలని కోరుకున్నారు. గ్రామ సర్పంచ్ బి.అనితతోపాటు స్థానిక మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



జల బిందెలతో వస్తున్న మహిళలు (ఇన్‌సెట్) జలాభిషేకం చేస్తున్న మహిళలు

రుణం కోసం రణం..



ఖమ్మం అర్బన్ తహసీల్‌కు పోటెత్తిన దరఖాస్తుదారులు (ఫైల్)

- కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం బారులు దీరుతున్న ప్రజలు
- భారీగా దరఖాస్తులతో మొరాయిస్తున్న సర్వర్లు
- ఈ నెల 20తో ముగియనున్న బీసీ రుణాల గడువు



అశ్వాపురంలో మీ సేవ వద్ద దరఖాస్తుదారులు

అశ్వాపురం: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీల్లోని పలు కులాల ప్రజలకు రూ.లక్ష ఆర్థిక సాయం మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. ఎలాంటి పూచీకత్తు లేకుండా కుల, చేతి వృత్తిదారుల సంక్షేమానికి ఈ సాయం ప్రకటించగా, ఈ నెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో అర్హులైన వారు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయం, ఆన్‌లైన్ సెంటర్ల వద్ద బారులు దీరుతున్నారు. మీ సేవలో ఆన్‌లైన్ చేశాక పత్రాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇస్తారు. అక్కడ కుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను డిప్యూటీ తహసీల్దార్లు పరిశీలించి డిజిటల్ సంతకాలు పెట్టి రెవెన్యూ సర్వర్‌లో అప్‌లోడ్ చేస్తారు. అనంతరం మళ్లీ మీ సేవ కేంద్రాల్లో ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, అంతా ఒకేసారి రావడంతో దరఖాస్తు ప్రక్రియ ఆలస్యమవుతుండగా, సర్వర్ కూడా మొరాయిస్తోంది. కొన్నిచోట్ల మీ సేవ కేంద్రాల నిర్వాహకులను తహసీల్దార్ కార్యాలయాలకే పిలిపించి దరఖాస్తులు స్వీకరిస్తుండగా.. అధికారులు అన్ని పనులు పక్కన పెట్టి సర్టిఫికెట్ల పరిశీలనలో నిమగ్నమవుతున్నారు. మరోపక్క విద్యాసంవత్సరం ప్రారంభమవుతుండడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు భారీగా దరఖాస్తులు చేసుకుంటుండగా రద్దీ మరింత పెరుగుతోంది.

పనిచేయని సర్వర్లు

మూడు రోజులుగా రెవెన్యూ సర్వర్లు, మీ సేవ సర్వర్లు మొరాయిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుదారులు పోటెత్తుతండడంతో ఈ పరిస్థితి తలెత్తుతోందని తెలుస్తోంది. మీ సేవలో సర్వర్లు సరిగా పనిచేయక వివరాలు ఆన్‌లైన్ చేయడానికి చాలా సమయం పడుతోంది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు మూడు, నాలుగు రోజులు సమయం పడుతుండటంతో దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇక రెవెన్యూ సర్వర్ సమస్య కారణంగా తహసీల్‌లో రోజుకు 10 నుంచి 20 సర్టిఫికెట్లకు మాత్రం ఆమోదం లభిస్తోందని సమాచారం. మరోపక్క బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు నాలుగు రోజులు మాత్రమే ఉండటంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తు గడువు మరిన్ని రోజులు పెంచాలని వారు కోరుతున్నారు.

బీసీ రుణాలకు గడువు పెంచాలి..



కుల, ఆదాయం ధ్రువీకరణపత్రాల కోసం బీసీలు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పనులు మానుకుని మీసేవ కేంద్రాలు, తహసీల్ చుట్టూ తిరగాల్సి వస్తోంది. సాంకేతిక సమస్యలతో ధ్రువపత్రాలు సకాలంలో అందడం లేదు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని బీసీ రుణాల దరఖాస్తు గడువు పెంచాలి.

–వేల్పుల మల్లికార్జున్, మల్లెలమడుగు, అశ్వాపురం మండలం

సమస్యలు పరిష్కరించాలి



బీసీ రుణాలకు దరఖాస్తు చేసే వారికి కుల, ఆదాయ ధ్రువపత్రాలు సకాలంలో రాక ఇబ్బంది పడుతున్నారు. పలుచోట్ల వారం రోజులకు కూడా సర్టిఫికెట్లు అందడం లేదు. రుణ దరఖాస్తుకు నాలుగు రోజులే ఉండటంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించి సర్టిఫికెట్లు త్వరగా అందేలా చూడాలి.

–తాటిపాముల ఐలయ్య, మొండికుంట, అశ్వాపురం మండలం